క్లుప్తంగా

29 నుంచి రాజగోపురం ప్రతిష్ట

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో బుధవారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో రాజగోపురం ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉత్సవాలకు భక్తులు హాజరు కావాలని కోరారు.

అన్నదానం విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె: మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు అన్నదానం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని అందరూ సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని ట్రస్టు అధ్యక్షులు రాజశేఖర రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి కోరారు. పాత కాలేజీ వద్ద కమిటీ సభ్యులు,పెద్దలతో సమావేశం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. పెద్దల సూచనలు, సలహాల మేరకు నిర్వహణ బాధ్యతలను పలువురికి అప్పగించారు. వేలాదిమంది భక్తులకు ఏర్పాటు చేసే అన్నదానంలో ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కరీమ్, భాలకృష్ణారెడ్డి, శంకర్ రెడ్డి, రామమూర్తి,రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్

మదనపల్లె సిటీ: భారతమాత పూజా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మదనపల్లెలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రూట్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక శేషమహల్ ఏరియా నుంచి భరతమాత చిత్రపటంతో పాటు అంబేడ్కర్ చిత్రపటాలతో ప్రత్యేక వాహనాల్లో బీటీ కాలేజీ వరకు ఊరేగింపు చేశారు. స్థానిక బీటీ కాలేజీలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు జెండా ఆవిష్కరించారు. భారతమాత స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. భరతమాత, దేశ నాయకుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు శ శంకర్, బీజేపీ నాయకులు నారదరెడ్డి, ఎల్లంపల్లి ప్రశాంత్, రవికుమార్, భగవాన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ములకలచెరువు: మండలంలోని బురకాయల కోటకు చెందిన సీనియర్ నాయకులు మంగళ మణి(55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అదేగ్రామాం బీకీవారిపల్లెకు చెందిన క్రిష్ణారెడ్డి గత పది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులకు ఆమే పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులు కేపీ మస్తాన్, వెంకటనర్సు, రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్

మదనపల్లె : నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసి ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామసముద్రం మండలం చెంబకూరు నుంచి అక్రమంగా కర్ణాటకకు ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న అక్రమ ఇసుకాసురులపై పోలీసులు ఉక్కు పాదం మోపి ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్లను తక్షణమే సీజ్ చేసి యజమానులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదివారం ఇసుక రీచ్‌ల నిర్వహణ లేకపోయినా కూడా దొంగ బిల్లులతో ఇసుకను తరలిస్తున్నా సంబంధిత మైనింగ్, పోలీస్ ,రెవెన్యూ ,అధికారులు చూసీచూడనట్లు వదిలేసి అక్రమ ఇసుకాసురులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇసుకాసురులపై పోలీస్ కేసులు నమోదు చేసి ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలోల కేన్సర్, హార్ట్, కిడ్నీ, బీపీ, షుగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ విభాగాలకు సంబంధించి వైద్యులు చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, బీటీ కాలేజీ కరస్పాడెంట్ మునిరత్నం, టీఎస్ఎ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి మహోత్సవం

పీలేరు రూరల్ : పీలేరు నాయీబ్రాహ్మణ, కళాకార సహోదరుల ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరోధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బండ్లవంక శ్రీరాములవారి దేవాలయం నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు తాగ్యరాజస్వామి చిత్రపఠము ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం టీటీడీ కల్యాణ మండపంలో ప్రముఖ శాక్సోఫోన్ విద్యాన్‌లు, డోలు విద్యాన్‌లచే గొప్పగా శాక్సోఫోన్ కచ్చేరి నిర్వహించారు. కార్యక్రమంలో కె. రాజన్న, కె. అంజి, పి. గిరినాథ, హరి, ఎల్. శ్రీనివాసులు, శంకర్, రమేష్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- రాజ్యాంగ విలువలను కాపాడాలి
- అంబేద్కర్ చూపిన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకున్న ప్రజలు


గణతంత్రదినోత్సవ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్లు


పీలేరు కోర్టు ఆవరణలో జాతీయజెండాకు వందనం

మదనపల్లె : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కృషిచేయాలని, దేశంలో ప్రతి పౌరుడి హక్కులు కాపాడేందుకు రాజ్యాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో జాతీయజెండాను ఎగురవేసి వందన సమర్పణ గావించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, దేశనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, సైనికభవన్, జెడ్పీహైస్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, బెంగళూరురోడ్డు ఈద్గా, టిప్పుసుల్తాన్ మైదానంలో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవవందనం స్వీకరించారు. యావత్ ప్రపంచానికి ప్రజాస్వామ్యవిలువలను అందించడంలో మన దేశం అగ్రగామిగా నిలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో 76వ రిపబ్లిక్ డే సందర్భంగా జెండా ఎగురవేసి వందన సమర్పణ గావించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాసులు, ప్రసాద్, ఫర్జానాఫీ, రజనినరేంద్ర, ముబీనాసలీం, సుగుణఆంజనేయులు, శ్రీలత, కరీముల్లా, కమిషనర్ కే.ప్రమీల పాల్గొన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గణతంత్ర దిన వేడుకల్లో భాగంగా ఆదివారం సబ్‌కలెక్టరేట్‌లో జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం రెవెన్యూడివిజన్ పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమసేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్‌ఎన్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, తహసీల్దార్ ఖాజాబీ, డీఏఓ రాఘవేంద్ర, సబ్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

– భారతప్రజలకు ఉన్నతమైన జీవనమార్గాన్ని చూపించే భారత రాజ్యాంగాన్ని ప్రతి ఇంటికీ ప్రభుత్వం పంపిణీ చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ సూచించారు. బెంగళూరురోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద వీసీకే, బాస్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.

– మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్స్ సచివాలయంలో సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, కురవంక పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ పసుపులేటిచలపతి, పొన్నేటిపాళ్యం సచివాలయంలో వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులిశ్రీనివాసులు జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ భానుప్రసాద్ జాతీయజెండాను ఎగురవేశారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, రామసముద్రం, చెంబకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు లీల, సునీత, ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌లో ఎస్‌ఐ నారాయణస్వామి, ఏబీఆర్సీ కార్యాలయంలో అధ్యక్షులు నాగప్ప, సచివాలయాల్లో సర్పంచ్‌లు జెండా ఎగురవేశారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ లు పద్మావతి, నారాయణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రత్యూష, పోలీస్ స్టేషన్ లో ఎస్‌ఐ తిప్పేస్వామి, జడ్పీ హైస్కూల్ లో హెచ్‌ఎం ఆంజాద్ అలీ ఖాన్, గ్రామ సచివాలయాల్లో సర్పంచులు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు.

పీలేరులో..

పీలేరు : పీలేరులో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కోర్టు ఆవరణలో 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్, సీనియర్ సివిల్‌జడ్జి రవి, తహసీల్దార్ కార్యాలయంలో భీమేశ్వర్ రావు, ఎంపీడీవో కార్యాలయంలో లతీఫ్‌ఖాన్, వివేకానంద్ సర్కిల్‌లో మాజీ సైనికులు, సర్కిల్ కార్యాలయం, మార్కెట్ యార్డు, తపాలా కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: గుర్రంకొండలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎమ్మార్సి కార్యాలయంలో ఎంఈవో సురేంద్రబాబులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ,విద్యార్థులు ధరించిన పలువురు దేశనాయకుల వేషాధారణ అందర్ని ఆకట్టుకొంది. మువ్వవన్నెల బెలూన్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రమీన్ ముక్తియార్, ఎంపీడీవో వెంకటేశులు, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జగన్మోహన్, నాయకులు రమేష్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలలో మువ్వన్నెల త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ గురునాథ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీమ్, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురు వేశారు.

మువ్వనెల రెపరెపలు

కేవీపల్లె : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామ సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల సేవలను కొనియాడారు. విద్యార్థులు గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, వల్లభాయ్‌పటేల్ వంటి దేశ నాయకుల అడుగు జాడల్లో నడవాలని సూచించారు. పాఠశాలల్లో పలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ


తంబళ్లపల్లె కోర్టులో జెండా ఆవిష్కరణ

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో జాతీయా జెండా ఎగరవేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రదీప్, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ నరసింహుడు, ఎమ్మార్సీలో ఎంఈవో వెంకటరమణ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జాతీయా జెండాను ఎగరవేశారు. మండల సరిహద్దులో ఉన్నటువంటి మదరసాలో ముస్లిం విద్యార్థులు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీలలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీటీఎం బస్టాండ్‌లో బాస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీటీఎం తెలుగు హైస్కూల్‌లో ఛైర్మన్‌తో పాటు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారు పలువురు విద్యార్థులకు నగదు, మిఠాయిలు, ఫలాలు అందించారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, ఎంపీడీవో శ్రీధర్‌రావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పి వి రమణ, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ రామ్మూర్తినాయక్, పీహెచ్‌సీలో డాక్టర్ ఇమ్మాన్యుల్, పశువుల ఆసుపత్రిలో డాక్టర్ విక్రమ్‌రెడ్డి, కలిచెర్ల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాయిని అమరనాథ్, మోడల్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గడ్డం అమరనాథ, ప్రిన్సిపల్ రామాంజులునాయక్ జెండాను ఎగురవేశారు.

సంక్షేమంతో పేదల అభివృద్ధి

బి.కొత్తకోట: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నిరుపేదల అభివృద్ధికి చేరువయ్యేలా ఉద్యోగులు పని చేయాలని తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ కోరారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన జాతీయపతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి హక్కులను గౌరవించాలని, అందరి బాధ్యతని అన్నారు. డీటీ మొహమ్మద్ అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు, సర్వేయర్ ముబారక్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పల్లవి పతాకాన్ని ఎగురవేయగా పండుగ వాతావరణంలో వేడుకలు జరిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళం శంకరయ్య పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్ఎంపీపీ ఖాదర్‌వలీ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ జీవన్ గంగనాధ్ బాబు, సీహెచ్‌సీలో డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఈ గిరిధర్‌బాబు, ఇతరా అధికారులు తమ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఎంఈవో భీమేశ్వరాచారీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో ఆదివారం రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఉమర్‌ఫారూక్ త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఉపేందర్‌రెడ్డి, సీహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి, ఎంఆర్‌సిలో ఎంఈఓ త్యాగరాజు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధింత అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జెండాను ఆవిష్కరించారు.

కలికిరిలో..

కలికిరి: మండలంలో ఆదివారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్, ఎంపీడీఓ భానుమూర్తిరావు, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు మహేశ్వరిభాయి, రైల్వే స్టేషన్ ఆవరణలో ఎస్ ఎంఆర్ సుబ్బారావు, పోలీస్ స్టేషన్‌లో సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి, కేవీకే కార్యాలయంలో సమన్వయకర్త డా. మంజుల జాతీయ జెండా ఆవిష్కరించారు.

సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో ..

కలికిరి సమీపం పాఠం వద్దనున్న సీఆర్‌పీఎఫ్ (సీఐఏటీ–3) కేంద్రంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ డీఐజీ/ప్రిన్సిపాల్ అనుపమ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.


జెండా వందనం చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో..


పెద్దమండ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో..


కేవీపల్లె : తిమ్మాపురం గ్రామ సచివాలయం వద్ద ..


కలకడలో జాతీయ జెండాతో మానవహారం


పెద్దతిప్పసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో..


బి.కొత్తకోటలో విద్యార్థుల ర్యాలీ






అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాజ్యాంగం పుస్తకాలను పంపిణీ చేస్తున్న శివప్రసాద్, రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో...,నిమ్మనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో...,గుర్రంకొండ మండలపరిషత్ కార్యాలయంలో..

ప్రజలను మోసగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కలికిరి: ప్రజల ఓట్లుతో గెలిచి గద్దెనెక్కిన తరువాత ప్రజలను మోసగించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, సంక్షేమాన్ని విస్మరిస్తే ఎంతటి వారికైనా పరాభవం తప్పదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇస్తామన్న తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు ఆర్థిక సాయం, రైతుకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఏ ఒక్కటీ అమలు చేయక పోవడం దారుణమన్నారు. సామాన్యులపై కూటమి నేతల దౌర్జన్యాలు ఎక్కువవ్వడం, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, ఆస్తులను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

గుట్టపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మహబూబ్ బాషా కుమారుడు షేక్ జాఫర్ సాదిక్ వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం గుట్టపాళెంలో నిర్వహించిన వలీమా కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాలలో గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, తిరునాథరెడ్డి, చెంగయ్య, హరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


గుట్టపాళెంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

రామసముద్రం : మండలంలోని చెంబకూరు, నారిగానివారిపల్లి, ఎలకపల్లి, కమ్మవారిపల్లి, కాప్పల్లె గ్రామ పంచాయతీలో వైఎస్సార్ సీపీ బలోపేతంపై ఆదివారం ఆ పార్టీ నాయకులతో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాయకులందరూ పార్టీ కోసం పని చేసి భవిష్యత్తులో తిరిగి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలన్న ధృడ సంకల్పంతో పని చేయాలన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సదుం రవీంద్రనాథ్, యువ నాయకులు జీ కే.చంద్ర, దండేవారిపల్లి శ్రీనివాసులు, షంషీర్, విజయ్ రాజు, చందు, నూర్, బషీర్, బొంపల్లి రఫీ, షఫీ పాల్గొన్నారు.

పీపీపీ మోడల్‌లో మెడికల్ కాలేజీ

- ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయం
- ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

మదనపల్లె : రాష్ట్ర పరిస్థితిని ఆలోచించిన తర్వాత పెద్దలు చంద్రబాబునాయుడు, పీపీపీ మోడల్(పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్)లో మెడికల్ కాలేజీ తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించనున్నామని, అంటే...అమ్మడం లేదని, ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. మెడికల్ కాలేజీ దయనీయ పరిస్థితుల్లో ఉందని, అక్కడ పనిచేస్తున్న ఈఈ అధికారి తాను అక్కడ పనిచేయడం కష్టంగా ఉందని, హోమ్ డిపార్ట్‌మెంట్‌కు వచ్చేస్తానని తనను లెటర్ అడిగి మరీ వెళ్లిపోయిందని వ్యాఖ్యలు చేశారు. అలాగే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయనివ్వమన్నారు. యథావిధిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉంటుందన్నారు. వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్వహిస్తామన్నారు. త్వరలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో సమావేశం ఏర్పాటుచేయించి, పూర్తిస్థాయిలో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. బీటీ కాలేజీని కాపాడుతూ, దానికి యూనివర్శిటీ స్థాయిని కల్పిస్తున్నామన్నారు. ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్, సెంట్రల్ గవర్నమెంట్ నుంచి వచ్చిన యూజీసీ బృందం క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి వెళ్లారన్నారు. మదనపల్లెకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తహూరా సమర్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ నుంచి అవార్డు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ నాయకులు ఆర్.జే.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన బీజేపీ

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, అనేక మతాలు, భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ ఐక్యంగా జీవనం సాగిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా, ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని బీజేపీ పాలకులు ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్స్, రైతాంగ నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా పట్టణంలో సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు ట్రాక్టర్ ర్యాలీని ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. టిప్పుసుల్తాన్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ, రింగ్ రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంట్లో అరగంట పాటు చర్చ కూడా లేకుండా నాలుగు లేబర్ కోడ్స్ ను ఆమోదించారన్నారు. అలాగే గంట కూడా చర్చ లేకుండా నల్ల రైతాంగ చట్టాలను ఆమోదించారని విమర్శించారు. ఇది అప్రజాస్వామిక చర్య అన్నారు. పదేళ్లలో దేశంలో పేదరికం పెరిగిందని, కార్పొరేట్ల వద్ద సంపద మరింత పోగు పడిందన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి. రమేష్ బాబు లు మాట్లాడుతూ.. బీజేపీ ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలి, రద్దు చేసిన రైతాంగ చట్టాలనే మరల తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవటం దుర్మార్గమన్నారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

మదనపల్లె : ఎన్నో సంవత్సరాలుగా కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయదలిచిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపుకృష్ణప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక,రైతు సంఘాల పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే కొత్త చట్టాలు తీసుకువస్తోందని విమర్శించారు. దేశంలో, కార్మిక రైతాంగ ,ప్రజా ఉద్యమాలను అణచి వేయాలని అనేక రకాలుగా అడ్డంకులు పెట్టడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. దశాబ్దాల పాటు సంఘటిత శక్తితో కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.